క్లుప్తంగా

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి



పనులు పరిశీలిస్తున్న కమిషనర్

రాయికల్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పట్టణంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్ సంతోష్‌కుమార్ సూచించారు. బుధవారం రాయికల్ పట్టణంలోని 3,4, మండలంలోని ఇటిక్యాల, భూపతిపూర్ గ్రామాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. మురికికాలువల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఆయన వెంట సర్పంచులు సామల్ల లావణ్య, జక్కుల చంద్రశేఖర్, కౌన్సిలర్లు తురగ శ్రీధర్‌రెడ్డి, సాయికుమార్ పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



భూమిపూజ చేస్తున్న బాపురెడ్డి, సర్పంచ్

కథలాపూర్: అన్ని వర్గాల సంక్షేమమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ లక్ష్యమని మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి అన్నారు.మండలంలోని భూషణరావుపేటలో బుధవారం నూతన గ్రామపంచాయతీ భవన పనులకు భూమిపూజ చేశారు. పంచాయతీ భవన నిర్మాణానికి లోక బాపురెడ్డి తన నానమ్మ గంగవ్వ జ్ఞాపకార్థం 4 గుంటల భూమి వితరణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమం కోసం పథకాలు ప్రవేశపెట్టిన ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. గ్రామ పంచాయతీ భవనం కోసం ఈజీఎస్ నిధులు రూ. 20 లక్షలు మంజూరయ్యాయని, ఎమ్మెల్యే కోటాలో అదనంగా రూ. 10 లక్షలు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ కూన సులోచన, ఎంపీటీసీ కొండ ఆంజనేయులు, జెడ్పీటీసీ నాగం భూమయ్య, ఉపసర్పంచ్ పల్లె సరిత, నాయకులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్సై

కోరుట్ల: సైబర్ నేరాలతో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ ఎస్సై ఆరీఫొద్దీన్ అన్నారు. ఈ మేరకు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్, పోలీసు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ నేరాలు ఎలా అరికట్టాలి అనే అంశంపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు జరిగినప్పుడు 1930 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జిందం రాజేశ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.గంగాప్రసాద్, శ్రీనివాస్, నటరాజ్, సంతోష్, సారా నిషాంత్, మొజొద్దీన్, ఫాతిమా, అధ్యాపకులు పాల్గొన్నారు.

గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



గోదావరి ఉధృతిని పరిశీలిస్తున్న తహసీల్దార్

ఇబ్రహీంపట్నం: గోదావరి పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ప్రసాద్ అన్నారు. మండలంలోని ఎర్దండి వద్ద గోదావరి ఉధృతిని బుధవారం పరిశీలించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ ఎగువన కురుస్తున్న వర్షాలతో శ్రీ రాంసాగర్ ప్రాజెక్టులోకి భారీగా వరద వస్తోందని, ప్రాజెక్టు నుంచి గోదావరిలోకి ఏ సమయంలోనైనా నీటిని ఎక్కువగా విడుదల చేసే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. మండలంలోని కోమటికొండాపూర్, ఎర్దండి, మూలరాంపూర్, బర్థీపూర్, వేములకుర్తి గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. గోదావరి వైపు గొర్రెలు, గేదేలను మేపేందుకు తీసుకవెళ్లవద్దని మత్స్య కార్మికులు చేపల వేటకు వెళ్లొద్దని సూచించారు. ఆయన వెంట ఆర్ఐ గంగాధర్, నాయకులు రాజన్న, గణేశ్ పాల్గొన్నారు.

కృష్ణా ముకుందా.. మురారి

జగిత్యాల/జగిత్యాల రూరల్/కోరుట్ల/ధర్మపురి/ ఇబ్రహీంపట్నం/మల్లాపూర్/ రాయికల్/కథలాపూర్/పెగడపల్లి/మల్యాల: కృష్ణాష్టమి వేడుకలు బుధవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులు చిన్నికృష్ణులు, గోపికల వేషధారణల్లో అలరించారు. ఆయా పాఠశాలల్లో చిన్నారులు ఉట్టి కొట్టి సంబురాలు జరుపుకున్నారు.



రాయికల్: కృష్ణాష్టమి వేడుకలు



మల్యాలలో గోపికలు, కృష్ణులుగా చిన్నారులు



కోరుట్ల: చిన్నికృష్ణుల వేషధారణలో చిన్నారులు



ధర్మపురిలో..



జగిత్యాలలో చిన్నారుల సంబురాలు



దుంపేటలో గోపికలు, కృష్ణుల వేషంలో చిన్నారులు

నిరుపేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్: నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ జిల్లా యువజన అధ్యక్షుడు బొల్లె అనిల్, ఎమ్మార్పీఎస్ సారంగాపూర్ ఇన్‌చార్జి మీసాల సాయిలు, జిల్లా అధికార ప్రతినిధి దుమాల పెద్దగంగారంతో పాటు, మోరపల్లి గ్రామ పద్మశాలీ సంఘం అధ్యక్షుడు దీకొండ రమేశ్, వడ్డెర సంఘం అధ్యక్షుడు గోపాల్‌తో పాటు 50 మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు ఎంతో దోహదపడుతున్నాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బొల్లె సత్తమ్మ, దావ సురేశ్, సింగిల్ విండో చైర్మన్లు మహిపాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రాయికల్: అన్ని వర్గాల సంక్షేమమే బీఆర్‌ఎస్ ధ్యేయమని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని ధర్మాజీపేట, కొత్తపేటకు చెందిన 25 మంది యువకులు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. సీఎం కేసీఆర్ పాలనలో ప్రతి ఇంట్లో లబ్ధిదారులున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, సర్పంచులు స్నేహలత, హరీశ్, రాజేశం, ఎంపీటీసీ శ్రీనివాస్, మండల యూత్ అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు కోల శ్రీనివాస్, ఉపసర్పంచ్ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

సమీకృత మార్కెట్ పనులు వేగవంతం చేయాలి

జగిత్యాల: జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్ పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. అదనపు కలెక్టర్ దివాకరతో కలిసి పనులను పర్యవేక్షించారు. అనంతరం బీట్‌బజార్ నుంచి గుట్టరాజేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే రహదారిని పరిశీలించి రహదారి నిర్మాణానికి నిధులు అంచనా వేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం 54 మందికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కమిషనర్ అనిల్, కౌన్సిలర్లు వాణి, రజియొద్దీన్, షకీల్ పాల్గొన్నారు.

గాలింపు చర్యలు చేపట్టాలని ఆదేశం

జగిత్యాలక్రైం: జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట గ్రామ శివారులోని గచ్చుమాట్ వాగు ప్రాంతంలో గల్లంతైన విద్యాసాగర్ ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం విద్యాసాగర్ వల్లంతైన ప్రాంతాన్ని పరిశీలించారు. గాలింపు చర్యలకు ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట కౌన్సిలర్ కోరె గంగమల్లు, నాయకులు ఉన్నారు.

చివరి ఆయకట్టుకు నీరందించాలని వినతి

సారంగాపూర్: మండలంలోని పెంబట్ల, కోనాపూర్ గ్రామాలకు సాగునీరు అందించే శ్రీరాంసాగర్ డీ–53 పరిధిలోని 13 ఆర్ కింది ఆయకట్టు చివరి భూములకు నీరు చేరేలా చర్యలు తీసుకోవాలని పెంబట్ల,కోనాపూర్ గ్రామాలకు చెందిన పలువురు రైతులు బుధవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్ వీర్‌సింగ్‌కు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

మల్లాపూర్: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్షురాలు సంధ్యారాణి అన్నారు. ఈనెల 11 నుంచి అంగన్‌వాడీ టీచర్లు చేపట్టనున్న నిరవధిక సమ్మె నోటీసును బుధవారం తహసీల్దార్ వీర్‌సింగ్‌కి అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే ఈ నెల 11 నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రజిత, ఇందిర, వకుల, సఫియా, గంగభవాని, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందజేయాలి



గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో

జగిత్యాల: పోషకాహారంతోనే ఆరోగ్యంగా ఉంటారని సీడీపీవో వీరలక్ష్మి అన్నారు. బుధవారం పట్టణంలోని వంజరివాడలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు అవగాహన కల్పించారు. పౌష్టికాహారం వల్ల ఆరోగ్యంగా ఉండటంతో పాటు, పుట్టబోయే బిడ్డ సైతం ఆరోగ్యవంతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాణి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్: తల్లిదండ్రులు చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య అన్నారు. బుధవారం జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్, చెర్లపల్లి గ్రామాల్లో పోషణ మాసం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు చిన్నారులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచులు ఎల్ల గంగనర్సు, తిరుపతి, ఉపసర్పంచ్ నలువాల పద్మ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జానకి అన్నారు. బుధవారం లక్ష్మీపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు సరైన పౌష్టికాహారంతో పాటు, జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆకుకూరలు, పండ్లు, పాలు, చిరుధాన్యాలు ఆహారంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చెరుకు జాన్, ఏఎన్‌ఎం ఫాతిమ పాల్గొన్నారు.

ధర్మపురి: పౌష్టికాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీవో వాణిశ్రీ అన్నారు. పట్టణంలోని న్యూ హరిజన కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ్ మహా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, కిశోర్ బాలికలు రక్తహీనతకు గురి కాకుండా ఆకుకూరలు, కాయగూరలు, సీజన్ ఫ్రూట్స్ తదితర వాటిని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమాదేవి, టీచర్ మాదవీలత, తదితరులున్నారు.

చిన్నారులకు అన్నప్రాసన

కథలాపూర్: మండలంలోని పెగ్గెర్లలో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో చిన్నారులకు బుధవారం అన్నప్రాసన నిర్వహించారు. గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేసి ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ జవిడి ప్రతాప్‌రెడ్డి, కార్యదర్శి అరుణ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పెరటితోటల పెంపకంపై అవగాహన

కోరుట్ల రూరల్: మండలంలోని పైడిమడుగు, మాదాపూర్ గ్రామాల్లోని అంగన్ వాడీ కేంద్రాల్లో బుధవారం తల్లులకు పెరటి తోటల పెంపకంపై సూపర్‌వైజర్ షమీం సుల్తానా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రత, పౌష్టికాహార ప్రముఖ్యత, వ్యక్తి గత పరిశుభ్రత తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రాజ్యలక్ష్మి, సుమలత, పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యం లోపిస్తే కార్యదర్శులపై చర్యలు

ఇబ్రహీంపట్నం: గ్రామాల్లో పారిశుధ్యం లోపిస్తే పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకుంటానని డీఎల్‌పీవో శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలో పారి శుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలతో మురికి కాలువల్లో చెత్త చెదారం పేరుకపోయిందని, రో డ్లపై గుంతల్లో నీళ్లు నిలువ ఉండి దోమలు ఎక్కువయ్యే అవకాశాలు ఉన్నాయని, కాబట్టి దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని, మురికి కాలువలపై బ్లీచింగ్ చేయాలని, గుంతల్లో ఆయిల్ బాల్స్ వేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచు నేమూరి లత, ఎంపీవో కృపాకర్, ఫీల్డ్ అసిస్టెంట్ అంజయ్య, పంచాయతీ కార్యదర్శి, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అయిలాపూర్‌లో వైద్య శిబిరం

కోరుట్ల రూరల్: మండలంలోని అయిలాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో ఇటీవల ఓ యువకుడు జ్వరంతో మృతి చెందటంతో వైద్యాధికారులు గ్రామంలో పలు వార్డులను తిరిగి వర్షాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. ఇండ్లలోని నీటి తొట్లలో, కుండల్లో, రబ్బరు టైర్లు, కూలర్లలో నిల్వ ఉన్న నీటిని తొలగించారు. నిలువ నీటితో వృద్ధి చెందిన దోమల వల్ల మలేరియా, డెంగ్యూ వంటి జ్వరాలు వచ్చే అవకాశాలున్నాయని వివరించారు. హెల్త్ క్యాంపులో 82 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి రక్త నమూనాలు సేకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పిడుగు రాధ, వైద్యాధికారి సమీనా, హెల్త్ సూపర్‌వైజర్ ధనుంజయ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు న్యాయం జరగాలి

జగిత్యాల: ప్రజలకు న్యాయం జరగాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వెన్న సురేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం మాట్లాడుతూ సర్దార్ సత్రంలో అక్రమ నిర్మాణం జరుగుతుందని రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించగా, కోర్టు ప్రజాప్రయోజన వాజ్యంగా స్వీకరించి దీనిపై జవాబు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ, ఎండోమెంట్, మున్సిపల్ శాఖలను కోరినట్లు తెలిపారు. కోర్టుపై నమ్మకం ఉందని, దీంతో ప్రజలకు తప్పకుండా న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నామన్నారు.

'హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలం'

మల్లాపూర్: రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మానుక ప్రవీణ్‌కుమార్ అన్నారు. టీడీపీ మండల శాఖ ఆధ్వర్యంలో తహశీల్దార్ వీర్‌సింగ్‌కి బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలన్ని నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎండీ.సాదుల్ల, పట్టణ అధ్యక్షుడు కాకర మాధవరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి నిమ్మల రాములు, ఉపాధ్యక్షులు చిప్ప రాజశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

'తొమ్మిదిన్నర ఏళ్ల పాలనలో ప్రభుత్వం వైఫల్యం'

గొల్లపల్లి:తొమ్మిన్నర ఏళ్ల పాలనలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని విధాల విఫలమైందని బీజేపీ ధర్మపురి అసెంబ్లీ కన్వీనర్ కస్తూరి సత్యం అన్నారు. గొల్లపల్లి మండల కేంద్రంలో బుధవారం మాట్లాడారు. ప్రభుత్వం వైఫల్యాలను కప్పి పుచ్చుకునేందుకే దశాబ్ది ఉత్సవాల పేరిట కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని వృథా చేసి ఎన్నికల ప్రచారం అధికారికంగా నిర్వహిస్తూ ప్రజా ఆశీర్వాదాల పేరిట యాత్రలు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. రైతు సంబరాలు జరిపినప్పుడు రైతులు అకాల వర్షాలతో నష్టపోతే ఇంత వరకు నష్టపరిహారం అందలేదన్నారు. కేవలం బీఆర్‌ఎస్ కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించి, చప్పట్లు కొట్టించి దుప్పట్లు కప్పించుకోవడం తప్ప చేసిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కట్ట మహేశ్, నాయకులు పాల్గొన్నారు.

'మధుయాష్కీపై దుష్ప్రచారం చేస్తే సహించేది లేదు'

కోరుట్ల: టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీపై దుష్ప్రచారాలు చేస్తే సహించేది లేదని జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడు గడ్డం వెంకటేశ్ అన్నారు. ఈ మేరకు కోరుట్లలో మాట్లాడుతూ మధు యాష్కీ, గౌడ్ ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే టికెట్‌కు దరఖాస్తు చేసుకోవటంతో సిట్టింగ్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే దేవిశెట్టి సుధీర్ ఓటమి భయంతో, అగ్ర కుల అహంకారంతో లేని పోని ప్రచారాలకు పాల్పడుతున్నాడని పేర్కొన్నారు. మధుయాష్కీ గౌడ్ తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించి తెలంగాణ ఏర్పాటుకు కృషి చేశారని, అలాంటి బడుగు బలహీన వర్గ నాయకుడిపై అగ్ర కుల అహంకారంతో కుట్రలు చేస్తే తగిన బుద్ధి చెపుతామని హెచ్చరించారు.

కొల్వాయి జీపీలో నిధుల మళ్లింపుపై విచారణ జరపాలి

- కార్యదర్శిని నిలదీసిన గ్రామస్తులు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామపంచాయతీలో నిధులు మళ్లింపుపై విచారణ జరపాలని పలువురు గ్రామస్తులు బుధవారం గ్రామపంచాయతీ కార్యదర్శిని నిలదీశారు. గ్రామపంచాయతీలో పలు బిల్లులకు ఆమోదం తెలిపి, సంబంధం లేని దుకాణాలకు బిల్లులు చెల్లించారని, ఇందులో ఒక దుకాణంకు రూ. 78 వేలు చెల్లించారని తెలిపారు. దీంతో పాటు ట్రాక్టర్‌కు డిజిల్ వినియోగంపై తప్పుడు లెక్కలు పేర్కొన్నారు. బావుల్లో క్లోరినేషన్ కూడా సక్రమంగా జరగడం లేదని తెలిపారు. గ్రామానికి వచ్చిన మొత్తం నిధులు, వాటిని ఏ ఏ కార్యక్రమాలకు వెచ్చించారని, ఏ మెరకు బిల్లులను డ్రా చేశారని కార్యదర్శిని ప్రశ్నించారు. నిధుల వ్యయంపై తక్షణమే గ్రామసభ నిర్వహించి, వాస్తవాలను ప్రజల ముందుంచాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

ఓటు హక్కు ప్రాధాన్యమైనది

జగిత్యాల: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో ప్రాధాన్యమైనదని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ తిరుపతి అన్నారు. బుధవారం ప్రజాస్వామ్య విజయంలో ఎన్నికల పాత్ర అనే అంశంపై విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశ భవిష్యత్ విద్యార్థుల చేతుల్లో ఉందని, తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని, సరైన అభ్యర్థికే ఓటు వేయడం ద్వారా దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంపత్, రాజయ్య, జగన్, సునీత పాల్గొన్నారు.

ఓటు హక్కు ప్రాధాన్యంపై ముగ్గులు

సారంగాపూర్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో స్వీప్ కార్యక్రమంలో భాగంగా బుధవారం కళాశాల ఆవరణలో విద్యార్థినులు వివిధ ముగ్గులు వేసి అలరించారు. ఓటు వినియోగంగా ప్రజలను చైతన్యవంతులను చేయాలన్న లక్ష్యంతో సందేశాత్మక ముగ్గులు వేసి విద్యార్థినులు ఔరా అనిపించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కొంక వేణు, క్యాంపస్ అధికారి రాజేందర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కరాటేలో జపాన్ బ్రౌన్ బెల్ట్ సాధించిన విద్యార్థి

ఇబ్రహీంపట్నం: అంతర్జాతీయ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన పోటీల్లో ఇబ్రహీంపట్నంకు చెందిన కరాటే విద్యార్థి ఎ.విశ్వంత్ అంతర్జాతీయ జపాన్ బ్రౌన్ బెల్ట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించాడు. రాష్ట్ర ప్రధాన శిక్షకుడు రాపోలు సుదర్శన్ చేతుల మీదుగా జపాన్ బ్రౌన్‌బెల్ట్‌తో పాటు సర్టిఫికెట్‌ను అందుకున్నట్లు కరాటే జిల్లా ప్రధాన శిక్షకులు బుధవారం తెలిపారు. జిల్లా నుంచి ముగ్గురు విద్యార్థులు ఎ.నిఖిల్, జి. శ్రేయన్ కార్తీక్, ఎ. విశ్వంత్ పాల్గొనగా విశ్వంత్ ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కరాటే మండల ప్రధాన శిక్షకులు వంశీనాయక్, తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ చెక్కులు పంపిణీ

గొల్లపల్లి: ప్రభుత్వం ప్రవేశపెట్టిన రుణమాఫీ పథకంలో భాగంగా గొల్లపల్లి మండలం సింగిల్‌విండో పరిధిలోని రైతు లబ్ధిదారులకు రుణమాఫీ చెక్కులను పీఎసీఎస్ చైర్మన్, జగిత్యాల ప్యాక్స్ చైర్మన్ డాక్టర్ సుంకుసాని రాజ సుమన్ రావు విండో కార్యాలయంలో బుధవారం అందజేశారు. 22 మంది లబ్ధిదారులకు 16.46 లక్షల చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నక్క శంకర్, జెడ్పీటీసీ జలేందర్, విండో వైస్ చైర్మన్ తిరుపతి, సీఈవో సుధాకర్ రావు. డైరెక్టర్లు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్ల సమస్యలు పరిష్కరించాలి

జగిత్యాల: తమ సమస్యలు పరిష్కరించాలని సీనియర్ సిటిజన్లు ప్రధానమంత్రికి పోస్టుకార్డులు పంపించారు. బుధవారం జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ పోస్టాఫీసుకు వెళ్లి పోస్టుకార్డులు డబ్బాలో వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు పోషణ, సంక్షేమ రక్షణ చట్టం 2019 సవరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదింపజేయాలని, రైల్వేటికెట్స్‌లో సీనియర్ సిటిజన్స్‌కు గతంలో ఇచ్చిన రాయితీని పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో విశ్వనాథం, సతీశ్‌రాజ్, మానాల కిషన్, దేవేందర్‌రావు, సత్యనారాయణ, ఎక్బాల్, యూసూఫ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పలువురి పరామర్శ

సారంగాపూర్: మండలంలోని రేచపల్లి గ్రామానికి చెందిన వొడ్నాల బుచ్చన్న మృతిచెందగా, బాధిత కుటుంబాన్ని బుధవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వేర్వేరుగా పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారి వెంట జెడ్పీటీసీ మేడిపల్లి మనోహర్‌రెడ్డి, సర్పంచ్ ఎడమల జయ, గుర్రాల రాజేందర్‌రెడ్డి, జమున, ఉపసర్పంచ్ రాచకొండ రాజేశం, నాయకులు పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

జగిత్యాలటౌన్: శ్రీలోకమాత పోచమ్మతల్లి ఆలయ 61వ వార్షికోత్సవ కరపత్రాన్ని బుధవారం జగిత్యాల ఆర్డీవో నర్సింహమూర్తి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నర్సింహమూర్తి మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా విలసిల్లుతున్న లోకమాత పోచమ్మతల్లి ఆలయ 61వ వార్షికోత్సవ కరపత్రాన్ని ఆవిష్కరించడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

నియామకం

జై గణేశ్ భక్త సమితి జిల్లా అధ్యక్షుడిగా సామల్ల సతీశ్

రాయికల్: జై గణేశ్ భక్త సమితి జగిత్యాల జిల్లా అధ్యక్షుడిగా రాయికల్ పట్టణానికి చెందిన సామల్ల సతీశ్‌ను నియమిస్తూ తెలంగాణ స్టేట్ జనరల్ సెక్రటరీ బొడ్డు రాజేశ్ నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా సతీశ్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయకులను ప్రతిష్ఠిస్తామని తెలిపారు.